సాక్షి
ప్రకాశం
బుధవారం। 27। నవంబర్। 2024



రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు.

- 8లో..



దివ్యాంగురాలి దారుణ హత్య?

దివ్యాంగురాలు దారుణ హత్యకు గురైన ఘటన టంగుటూరులో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
28/23

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

అర్హులైన ఉపాధ్యాయులకు 28న ఇంటర్వ్యూలు

ఒంగోలు సిటీ: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఐదు అసిస్టెంట్ సెక్టోరల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకొని, వెరిఫికేషన్ అనంతరం అర్హత సాధించిన ఉపాధ్యాయులకు ఇంటర్వ్యూలు ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు సెలక్షన్ కమిటీ మెంబరు, డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఇప్పటికే కాల్ లెటరు, వ్యక్తిగతంగా పోస్ట్ ద్వారా సమాచారం పంపించారన్నారు. అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యేటప్పుడు వారి వెంట ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్స్ తో హాజరుకావాలన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ క్యారమ్స్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండర్ 17 రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ హజీరాబేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక హౌసింగ్ బోర్డులోని బొమ్మరిల్లు ఆశ్రమంలో హాజరైన క్రీడాకారుల ప్రతిభా సామర్థ్యాలు పరిశీలించిన అనంతరం జిల్లా జట్టు ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ ఆందోళనలు

ఒంగోలు సిటీ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఆర్థిక బకాయిల చెల్లింపులు, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా స్థాయిలో డిసెంబరు 20, 21 తేదీల్లో, జనవరిలో రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.కీర్తి, కౌన్సిలర్ పి.వి.సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర సంఘం నోటీసును అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు వివిధ రకాల ఆర్థిక బకాయిలు రూ.22 వేల కోట్లు ఉన్నాయన్నారు. ఎన్నికల హామీ మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర డిడక్షన్స్ రూపంలో సుమారు రూ.2500 కోట్లు ప్రభుత్వానికి చేరిందని తెలిపారు. కనీసం వాటినైనా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మంజూరు చేసి వారి అత్యవసర పనులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మారెళ్లలో కొండచిలువ కలకలం



శివాలయం పక్కన కనిపించిన కొండచిలువ

ముండ్లమూరు (దర్శి): మండలంలోని మారెళ్ల గ్రామంలో శివాలయం వద్ద కొండ చిలువ కలకలం సృష్టించింది. స్థానికులు అటవీ శాఖ అధికారులకు అందించారు. దీంతో వారు పాములు పట్టే వారి ద్వారా కొండచిలువను అడవిలో వదిలేశారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో సాత్విక్‌కు బంగారు పతకం



బంగారు పతకం సాధించిన మోహన్ సాత్విక్‌ను అభినందిస్తున్న బాబురావు

కొత్తపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో అనంతపురంలో నిర్వహించిన పోటీలో కరాటే కుమితే విభాగంలో కొత్తపట్నం విద్యార్థి బంగార పతకం సాధించాడు. ఈ సందర్భంగా వికాస్ స్కూల్ కరస్పాండెంట్ పి.బాబురావు ఆధ్వర్యంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన అవనిగడ్డ మోహన్ సాత్విక్ 68వ కరాటే స్కూల్ గేమ్స్‌లో అండర్ 17 విభాగంలో 54 కేజీల పోటీలో గోల్డ్‌మెడల్ సాధించి ప్రథమ బహుమతి అందుకున్నాడు. ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మోహన్ సాత్విక్‌ను, అతని కోచ్‌గా వ్యవహరించిన వల్లభుని వెంకటేశ్వర్లును బాబురావు సత్కరించారు. ఇదే పోటీలో 35 కేజీల విభాగంలో రజత పతకం గెలుచుకున్న తంబు యశ్వంత్, కాంస్య పతకం సాధించిన చెన్నపట్నం వెంకట వరుణ్‌తేజను కూడా సత్కరించారు. నేషనల్‌కు సెలెక్ట్ అయినందుకు సాత్విక్‌ను జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ షేక్ అజీరాభేగం అభినందించారు.

వేతన జీవుల భవిష్యత్.. బఖాయిలా..

కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల ఆనందం ఆవిరైపోయింది. ఆర్థిక ప్రయోజనాలు ఒక్కటీ నెరవేరడం లేదు. చంద్రబాబుకు ఓటేస్తే అన్ని బకాయిలూ వస్తాయని ఆశ పడ్డారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా చిల్లిగవ్వ విదల్చలేదు. అసలు ఇంతవరకూ ఆ ప్రస్తావనవే లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. పీఆర్‌సీ, పీఎఫ్ లోన్లు, డీఏ, ఏపీ జీఎల్ఐ బకాయిలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇలా జిల్లాలో దాదాపు ఉద్యోగులకు చెల్లించాల్సినవి దాదాపు రూ.2 వేల కోట్లు ఉన్నాయి. ఇవన్నీ కూటమి ప్రభుత్వం ఇచ్చేనా అని ఉద్యోగులు ఆందోళ చెందుతున్నారు.

- ఉద్యోగుల ఆశలు గల్లంతు
- డీఏ, పీఆర్‌సీ, పీఎఫ్ బకాయిల కోసం నెలల తరబడి ఎదురు చూపులు
- అధికారంలోకి వచ్చి 5 నెలలు గడిచినా చిల్లిగవ్వ విదల్చని ప్రభుత్వం
- జిల్లాలో దాదాపు 20 వేల మంది ఉద్యోగులు
- రూ.2 వేల కోట్లకు పైగా బకాయిలు



చీమకుర్తి: ఇంట్లో పెళ్లి ఉందని పీఎఫ్ లోను కోసం దరఖాస్తు చేసుకున్నాడో ఉద్యోగి.. డబ్బుల కోసం ఎదురు చూశాడు..రాలేదు.. అప్పుచేసి పెళ్లి చేశాడు. ఇప్పటి వరకూ లోను రాలేదు. ఇక ఇల్లు కట్టుకుందామనో, అపార్టుమెంట్ కొనుక్కుందామనుకునే వారి సంగతి సరేసరి. ఎప్పుడు చూసినా సీఎఫ్ఎంఎస్‌లోనే ఫండ్స్ క్లియరెన్స్ అనే చూపుతుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పోనీ పీఆర్‌సీ బకాయిలైనా వస్తాయా..? అని ఎదురు చూస్తే ఎప్పుడో రిటైర్డ్ అయినప్పుడు ఉద్యోగ విరమణతో కలిపి ఇస్తారంట అని యూనియన్ నాయకులు చెబుతుండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. పోనీ రిటైర్డ్ అయితే బెనిఫిట్స్ అయినా వస్తాయా..? అని ఎదురు చూస్తే అవి ఎప్పుడు వస్తాయో చెప్పలేని దయనీయ స్థితి. ఇలా ఒకటేమిటి పీఆర్‌సీ బకాయిలు, డీఏల బకాయిలు, పీఎఫ్ లోన్లు, రిటైర్డ్ బెనిఫిట్స్, ఏపీ జీఎల్ఐ బకాయిల కోసం ఉద్యోగులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు. చంద్రబాబు వస్తే బకాయిలన్నీ త్వరగా వస్తాయనే ఆశతో ఉన్న ఉద్యోగుల ఆశలు గల్లంతయ్యాయి. అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటుతున్నా ప్రభుత్వం ఇంత వరకు ఉద్యోగులకు చిల్లిగవ్వ విదిల్చింది లేదు. వచ్చే ఏడాది మార్చి వరకు ఎలాంటి బకాయిలు చెల్లించేది లేదని, ఇటీవల రహస్యంగా జీవోను కూడా విడుదల చేశారని ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు.

గడువు ముగిసినా కమిషన్ వేయలేదు

వాస్తవానికి 2023 జూలై నుంచి నూతన పీఆర్‌సీ కమిషన్ ఉద్యోగులకు వర్తించాల్సి ఉంది. అప్పటికే గత ప్రభుత్వం వేసిన పీఆర్‌సీ కమిషన్‌కు గడువు ముగియటంతో పూర్తిగా రద్దయింది. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నూతన పీఆర్‌సీని ప్రకటించి ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని ఉద్యోగ సంఘాల నాయకులు ఐదు నెలలు నుంచీ డిమాండ్ చేస్తూనే ఉన్నారు. డీఏ, పీఆర్‌సీ, ఐఆర్ అన్ని ఇస్తారులే అని సంబరపడిన ఉద్యోగులకు మొండిచెయ్యి తప్ప పైసా విదిల్చింది లేదనే ఆరోపణలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. ఐఆర్ సంగతి దేవుడెరుగు నూతన పీఆర్‌సీని వేయలేదనే ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారు. పీఆర్‌సీ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని జిల్లాలోనే పలు ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఇంత వరకు పీఆర్‌సీ కమిషన్ లేదు. ఐఆర్ ఊసే లేదనే ఆందోళనలో ఉద్యోగులున్నారు.

సరెండర్ లీవ్స్, ఏపీ జీఎల్ఐ సంగతి సరేసరి

ఉద్యోగులు దాచుకున్న ఎర్న్‌డ్ లీవ్స్‌లు ఎన్‌క్యాష్ చేసుకొని బిల్లులు పెట్టుకున్న సరెండర్ లీవ్స్ బకాయిలు రావాల్సిన ఉద్యోగులు జిల్లాలో సుమారు వెయ్యి మంది పైనే ఉన్నారు. వాటి ద్వారా రావాల్సిన బకాయిలు రూ.100 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. ఏపీ జీఎల్ఐ కాలపరిమితి పూర్తయి మెచ్యూరిటీ అయిన బకాయిలు రావాల్సిన ఉద్యోగులు మరో 200 మంది వరకు ఉన్నారు. వారికి మరో రూ.100 కోట్ల వరకు రావాల్సి ఉంది.

జిల్లాలో దాదాపు రూ.2 వేల కోట్లపైనే బకాయిలు

జిల్లాలో టీచర్లు 5,600 మంది ఉన్నట్లు అంచనా. టీచర్లతో పాటు ఇతర శాఖలకు చెందిన వారితో కలిపి మొత్తం జిల్లాలో 20 వేల మంది ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. రాష్ట్రం మొత్తం మీద ఉద్యోగులకు రూ.23 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. దాని ప్రకారం ప్రకాశం జిల్లాకు కనీసం రూ.2 వేల కోట్లు వరకు రావాల్సి ఉంది. వాటిలో ప్రధానంగా పీఆర్‌సీ బకాయిలు ప్రథమ స్థానంలో ఉండగా, పీఎఫ్ లోన్లు, డీఏ, ఏపీ జీఎల్ఐ బకాయిలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఉన్నాయి. చంద్రబాబు అధికారం చేపట్టి 5 నెలలు నిండినా ఒక్కటంటే ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. దసరాకు ఇస్తారనుకున్నారు. కనీసం దీపావళికి అనుకున్నారు. ఇక సంక్రాంతికి ఇస్తారా అంటే అది కనిపించడంలేదని పెదవి విరుస్తున్నారు.

> ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలి
>
> 
>
> ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి. పీఆర్‌సీ కమిషన్‌ను వేసి నివేదిక వచ్చే లోపు ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలి. గతంలో పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను, పీఎఫ్ రుణాలు చెల్లించాలి.
>
> – డీ.నాగయ్య, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి

పీఎఫ్ బకాయిలు రూ.1000 కోట్లు పైనే..

ఉద్యోగులు తమ జీతం నుంచి దాచుకున్న పీఎఫ్ నుంచి రుణాల కోసం దాచుకున్న వారి సంఖ్య జిల్లాలో దాదాపు 5 వేల మంది పైనే ఉన్నారు. వారికి ఒక్కొక్కరికి వారి జీతాన్ని బట్టి దరఖాస్తు చేసుకున్న మొత్తం మేరకు సరాసరిన రూ.1000 కోట్ల పైనే రావాల్సి ఉంది. పెళ్లిళ్లు, ఇళ్ల కట్టుకోవడం, ఆరోగ్యం బాగులేక, ఇతర అవసరాల కోసం పీఎఫ్ రుణాలు కావాలని దరఖాస్తు చేసుకున్న వారూ ఉన్నారు. వారితో పాటు ఉద్యోగ విరమణ చేసిన వారు మరో 500 మంది వరకు ఉన్నట్లు అంచనా. వారందరికీ రావాల్సిన పీఎఫ్ కోసం ఉద్యోగులు ఐదు నెలలుగా పీఎఫ్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎప్పుడు వస్తాయోనని తమ బిల్లులు సీఎఫ్ఎంఎస్‌కు పోయాయా..? లేదా అని ఆరా తీస్తున్నారు. కానీ ఇంత వరకు వారికి రావాల్సిన పీఎఫ్ రుణాల ఆచూకే లేదు.

మోదీకి దేశాన్ని పాలించే హక్కులేదు

- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకుల విమర్శ
- దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని మండిపాటు
- కలెక్టరేట్ వద్ద మహా ధర్నా



కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో పాల్గొన్న వివిధ రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా దేశ ప్రజల సంపదను, జాతీయ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని, ప్రధాన మంత్రి మోదీకి దేశాన్ని పాలించే నైతిక అర్హత లేదని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలపై నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక, వ్యవసాయ కార్మిక సంఘాలు, వృత్తి, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశంలోని నిరుపేదలు పన్నుల రూపంలో 64 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారని చెప్పారు. ప్రధాని మోదీకి అత్యంత ఆప్తులైన అదానీ, అంబానీల వంటి 21 మంది కార్పొరేట్ సంపన్నుల చేతిలో 57 శాతం సంపద ఉండగా వారి తలసరి ఆదాయం 53 శాతం ఉందని, కానీ వారు కేవలం మూడు శాతం మాత్రమే జీఎస్టీలు చెల్లిస్తున్నారని వివరించారు. సామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధ కనీస మద్దతు ధర ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట స్వామి మాట్లాడుతూ కేరళ తరహాలో రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించి అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.20 వేల పింఛన్ సౌకర్యాన్ని వర్తింపచేయాలన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బడా పారిశ్రామికవేత్తలకు రూ.14.65 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన విధంగానే అప్పుల ఊబిలో కూరుకొని పోయిన రైతుల ఒక పర్యాయం పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడం ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లలిత కుమారి కోరారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయ మాట్లాడుతూ పురుషులకు సమానంగా మహిళలకు కూడా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు కోరారు. వెలుగొండ ప్రాజెక్టును తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులను నివారించేందుకు మద్యాన్ని నిషేధించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమాదేవి డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు రైతు నాయకులు వడ్డే హనుమారెడ్డి, జజ్జురి జయంతి బాబు, పరిటాల కోటేశ్వరరావు, కే.నాంచార్లు, చావలి సుధాకర్ అధ్యక్షవర్గంగా వ్యవహరించగా పీఓడబ్ల్యూ కార్యదర్శి మంజుల, ఐఎఫ్టీయూ ఆర్ మోహన్, కె.నాంచార్లు, ఎస్కే మాబు, శ్రీరాం శ్రీనివాసరావు, ఎం ఏ సాలార్, బి.పద్మ, రమేష్, కాలం సుబ్బారావు, వి.బాలకోటయ్య, జాలా అంజయ్య, జార్జి, పిన్నిక శ్రీనివాసరావు, శివరాం, పేరయ్య, ఉబ్బా కోటేశ్వరరావు, దేశింగరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టర్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



కార్పొరేట్ల దోపిడీని ప్రతిబింబించే ప్రదర్శన

నిర్దేశించిన విధులు సక్రమంగా నిర్వహించాలి

- మీకోసం అర్జీల పరిష్కారంపై పర్యవేక్షణ ఉండాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు వారికి కేటాయించిన విధులన్నీ చిత్తశుద్ధితో సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. అదేవిధంగా డివిజన్‌లలో మీకోసం అర్జీలు పరిష్కారం అవుతున్న తీరును సంబంధిత సబ్ కలెక్టర్, ఆర్డీవోలు పర్యవేక్షించాలన్నారు. ప్రకాశం భవనం నుంచి మంగళవారం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారం, ఇతర అంశాలకు సంబంధించి గ్రామ స్థాయి సిబ్బంది ఇచ్చిన నివేదికలు తహశీల్దార్‌లు, మండల స్థాయి నివేదికలు సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మీకోసం అర్జీల్లో దాదాపు 90 శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నందున వాటిని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలన్నారు. అర్జీలు నిర్దిష్ట గడువులో పరిష్కరించి అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి వకాలత్, కౌంటర్, రివ్యూ పిటిషన్లు సకాలంలో దాఖలు చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు చేసిన తప్పులకు తాను కోర్టుకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో సర్వే, రెవెన్యూ అంశాలపై వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటికి సంబంధించిన డేటా పక్కాగా నిర్వహించాలన్నారు. పొలాలకు వాటర్ టాక్స్ మాడ్యూల్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సాగునీటి సంఘాలకు ఎన్నికల నేపథ్యంలో స్థానిక పరిస్థితులను ఏ విధంగా పరిగణలోకి తీసుకోవాలి, ఎలా అప్‌లోడ్ చేయాలనే అంశాలపై వివరించారు. దీనిలో డీఆర్ఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వీరారెడ్డి, డి.వీరాంజనేయులు

ఒంగోలు సిటీ: యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, వీరాంజనేయులు తెలిపారు. ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా శాఖ స్వర్ణోత్సవ మహాసభల్లో జిల్లా ఆఫీస్ బేరర్స్, స్టేట్ కౌన్సిలర్, ఆడిట్ కమిటీ మెంబర్స్, ఫ్యామిలీ వెల్ఫేర్ స్కీమ్ డైరెక్టర్స్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా కొమ్మోజు శ్రీనివాసరావు, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ మహాసభల్లో పలు తీర్మానాలు ప్రవేశపెట్టారని తెలిపారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ డీఏ బకాయి మంజూరు చేయాలని, జీపీఎస్ ను కాలయాపన చేయకుండా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమ్మకు వందనం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపచేయాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను సమాంతరంగా ఉంచాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక పీఎస్, హెచ్ఎం పోస్టులు కేటాయించాలని కోరారు. యాప్స్ ఎమ్మార్సీలో మాత్రమే నిర్వహించాలని, ఎయిడెడ్ టీచర్స్‌కు హెల్త్‌కార్డ్స్ వెంటనే మంజూరు చేయాలని, మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 117 ను రద్దు చేసి మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలలో ఉంచాలని, విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని, హెల్త్ కార్డ్స్ ద్వారా నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన రెండు సంవత్సరాల చైల్డ్‌కేర్ లీవ్ ఇవ్వాలని, జెడ్పీ కార్యాలయంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తీర్మానాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం: జిల్లా అధ్యక్షునిగా షేక్ అబ్దుల్ హై, ప్రధాన కార్యదర్శిగా డి.వీరాంజనేయులు, జిల్లా కోశాధికారిగా ఎస్.చిన్నస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఎస్.రవి, జిల్లా సహాధ్యక్షునిగా ఐవీ రామిరెడ్డి, జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరిలతో పాటు 15 మందిని జిల్లా కార్యదర్శులుగా, 10 మందిని రాష్ట్ర కౌన్సిలర్లుగా, ఏడుగురిని జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులుగా, 16 మందిని కుటుంబ సంక్షేమ డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.



యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

రాజ్యాంగ గొప్పదనాన్ని తెలుసుకోవాలి



భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: భారత దేశ రాజ్యాంగం అత్యున్నతమైనది, రాజ్యాంగ గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగ గొప్పదనం ప్రతి ఒక్కరికీ తెలియాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2015 నవంబర్ 26 నుంచి ప్రతి సంవత్సరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఎనలేని కృషి చేసి, భారత రాజ్యాంగాన్ని రూపొందించి అందరికీ ప్రేరణగా నిలిచారన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ 1949వ సంవత్సరం నవంబర్ 26వ తేదీ భారత రాజ్యాంగం ఆమోద దినం అని అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని హెచ్‌సీఎం సెంటర్, కోలాస్ సెంటర్‌లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రతి ఒక్కరూ రాజ్యాంగం మేరకు నడుచుకోవాలి

ఒంగోలు అర్బన్: ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం అనుసరించి నడుచుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. దీనిలో ఎస్‌డీసీ లోకేశ్వరరావు, వరకుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రానైట్ ముడి రాళ్ల లారీలు పట్టివేత



పట్టుబడిన లారీలు

చీమకుర్తి రూరల్: అక్రమంగా గ్రానైట్ ముడిరాళ్ల రవాణా చేస్తున్న లారీలను గనుల శాఖ అధికారులు, రామతీర్థం ప్రాంతంలో మైనింగ్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా దాడులు చేసి పట్టుకున్నారు. గ్రానైట్ ముడిరాళ్ల లారీలు ఏపీ ఎండీసీ ప్రాంగణంలోకి తరలించారు.

2 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు: మాదకద్రవ్యాలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక టోల్ ప్లాజా సమీపంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ మాలిక్, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బిప్లబ్ బిస్వాస్ లపై అనుమానంతో తనిఖీ చేసి వారి వద్ద 2 కేజీల రెండు గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ జీవనోపాధి నిమిత్తం సింగరాయకొండ, జరుగుమల్లి మండలాలల్లో రొయ్యల కంపెనీల్లో పనులు చేసుకుంటున్నారు. టంగుటూరులో మద్యం దుకాణం వద్ద చికెన్ పకోడి బండి పెట్టుకొని నడుపుకుంటూ అధిక డబ్బులకు అలవాటు పడి గంజాయి తరలించి విక్రయిస్తున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ హజరత్తయ్య తెలిపారు.



బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



నివాళులర్పిస్తున్న చుండూరి రవిబాబు, కుప్పం ప్రసాద్, బత్తుల కటారి శంకర్, నాయకులు



ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న ప్రభుత్వం

- జగనన్న క్యాబినెట్‌లో దళితులకు ప్రాధాన్యత
- దోపిడీ బయటపెట్టకుండా చేయటానికే ప్రతిపక్షానికి పీఏసీ పదవి ఎగ్గొట్టారు
- వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తోందని, హక్కులను కాలరాస్తోందని, అక్రమ కేసులు బనాయిస్తోందని, జైళ్లల్లో ఒక పార్టీకి సంబంధించిన వ్యక్తులతో నింపేస్తున్నారని ఆరోపించారు. మీ పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి యర్రగొండపాలెం సెంటర్‌లో ఉన్న టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు విగ్రహానికి ఉరివేసుకోవాలని ప్రయత్నించాడంటే ప్రజలు మిమ్మల్ని వ్యతిరేకిస్తున్న విషయాన్ని గమనించాలన్నారు.

కూటమి ప్రభుత్వంలో కొందరికే రాజ్యాంగం

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉన్న సమయంలో బడుగు, బలహీన వర్గాలకు సంబంధించి అన్ని కులాలకు చెందిన 5 గురికి డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చారన్నారు. ఈ రోజు ఒకే ఒక్క డిప్యూటీ చీఫ్ మినిస్టర్ ఉన్నారన్నారు. కులాలను, మతాలను రెచ్చకొట్టి వారి మధ్య చిచ్చుపెట్టి ఆ మంటల్లో చలికాచుకుంటున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు.

జగనన్న పాలనలో దళితులకు ప్రాధాన్యత

5గురికి దక్కాల్సిన డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పదవిని ఒకే ఒక్కరు కొట్టేశారని, అందుకు ప్రధాన కారణం అధికార వ్యామోహమేనని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పదవీ కాలంలో 5గురు దళితులకు క్యాబినెట్‌లో హోదా కల్పించారన్నారు.

పీఏసీ పదవీ ప్రాధాన్యత తెలియదా?

1921లో బ్రిటీష్ భారత ప్రభుత్వం పీఎస్‌సీ చైర్మన్ హోదాకు ప్రాముఖ్యత ఇచ్చిందని, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఆ ప్రభుత్వంలో జరిగే తప్పులు బయట పెట్టలేరన్న ఉద్దేశంతో ఆర్థిక మంత్రులు, ప్రభుత్వంలో కీలక శాఖలు నిర్వహించే వారు పీఎస్‌సీ చైర్మన్‌ను పొందకూడదు, అనుభవించకూడదన్న నిబంధన ఉండేదన్నారు. 1981లో ఇద్దరు సభ్యులున్న బీజేపీకి సంఖ్యా బలం లేకున్నా పీఏసీ చైర్మన్ ఇచ్చారని, 55 మంది సభ్యులు ఉండాల్సినప్పుడు 22 మంది సభ్యులు ఉన్నప్పటికీ ఆ పదవీని ప్రతి పక్షాలకు ఇచ్చారని తెలిపారు. పార్లమెంటులో 52 మంది సభ్యులు ఉండాల్సి ఉండగా 44 మంది సభ్యులున్నప్పటికీ స్వతంత్ర పార్టీ సభ్యుడికి పీఏసీ చైర్మన్ పదవీ ఇచ్చారని తెలిపారు. మరి నేడు కూటమి ప్రభుత్వం పీఏసీ పదవీ ప్రతిపక్షానికి ఇవ్వకుండా ఎగగొట్టిందన్నారు.

దోపిడీని బయటపెట్టకుండా చేయడానికే..

పీఏసీ పదవీ ఎందుకు ఇవ్వడంలేదంటే.. వ్యవస్థలను దోచుకుంటున్న దోపిడీని బయటపెట్టకుండా చేయటానికని, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న వారిని ప్రశ్నించకుండా ఉండటానికన్నారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బస్టాండ్ సెంటర్‌కు చేరి అక్కడ అంబేడ్కర్‌కు విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తి రెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, జి.వెంకటరమణారెడ్డి, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, వివిధ విభాగాల నాయకులు ఎం.ఆదిశేషు, సయ్యద్ జబీవుల్లా, షేక్ షాబీర్‌బాషా, ఏకుల మునలారెడ్డి, కె.గురుప్రసాద్, ఎల్లారెడ్డి రోషిరెడ్డి, ఆర్.అరుణాబాయి, పల్లె సరళ, ఎస్.సుందరరాజు, రాములు నాయక్, షేక్ బుజ్జి, బాష్యం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



దర్శి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అన్నీ సామాజిక వర్గాలకు సమాన హక్కులు కల్పించిన మహానీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు తెలుసుకున్నప్పుడే సమాజం బాగుంటుందన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, కురిచేడు జెడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నాయకులు కొడవటి జాన్, పాలెపోగు డగ్లస్, కుంటా అచ్చారావు, అన్నవరపు రవి, మజ్జువలి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిధిలోనే అధికారులు పనిచేయాలి

- ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే అధికారులు పనిచేయాలని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. ఒంగోలులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి చుండూరు రవిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల బ్రహ్మానందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ రాజ్యాంగంలో వాక్ స్వాతంత్ర్యం ప్రతి ఒక్కరికీ ఉంటుందని, దానిని ఎవరూ దుర్వినియోగం చేసుకోరాదన్నారు. రాజ్యాంగ నిబంధనలు మరిచి అధికారులు అప్పుడప్పుడూ రాజకీయ నాయకులకు తలొగ్గుతున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును బత్తుల బ్రహ్మానందరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, కార్పొరేటర్లు ఇమ్రాన్, ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, దాసరి కరుణాకర్, షేక్ నాగూర్, డివిజన్ అధ్యక్షుడు రాజేష్, ముల్లంగి రవీంద్రారెడ్డి, రొండా అంజిరెడ్డి, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, జనార్దన్, పి.వెంకయ్య నాయుడు, వి.బాలకృష్ణ, ఆనం శ్రీనివాసరెడ్డి, 16 డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, లీగల్‌సెల్ నగరకంటి శ్రీనివాసరావు, అద్దంకి ఎంపీపీ నాగమల్లి, మేరికుమారి, జి.శివకుమార్, జి.వెంకటేశ్వర్లు, 13 డివిజన్ అధ్యక్షుడు ఎం.సూర్యరాజేష్, పిగిలి శ్రీనివాసరావు, తేళ్ల విక్టర్‌పాల్, కఠారి సంజీవ్, పూర్ణచంద్రారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగురాలి దారుణ హత్య?

- మణికట్టుపై కత్తి గాయాలు
- మెడకు కండువాతో ఉచ్చు బిగించిన వైనం
- టంగుటూరు వాణీ నగర్‌లో ఘటనన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

టంగుటూరు: దివ్యాంగురాలు దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టంగుటూరు వాణీ నగర్‌లో రెండు రోజులుగా మృతురాలి ఇంటికి తాళం వేసి ఉండటంతో అనుమానంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని తాళం పగులగొట్టి చూడటంతో మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు వాణీ నగర్‌లో బొడపాటి హైమావతి (40) భర్త పెద్ద రంగారెడ్డి గత తొమ్మిది నెలలుగా నివాసం ఉంటున్నారు. భర్త పెద్ద రంగారెడ్డి నెల్లూరు జిల్లా తడలోని శ్రీసిటీ సమీపంలో ఓ ప్రైవేటు కంపెనీలో డ్రైవరుగా పని చేస్తుంటాడు. రంగారెడ్డి పది రోజులకు ఒకసారి ఇంటికి వచ్చి పోతుంటాడు. ఎప్పటిలాగే శనివారం ఇంటికి వచ్చి, ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో పని నిమిత్తం బయలుదేరి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా ఉన్న హైమావతి రెండు రోజులుగా బయటకు రాకపోవడం, ఆమె భర్తకు ఫోన్ చేస్తున్నా సమాధానం ఇవ్వకపోవడం, ఇంటి బయట తాళం వేసి ఉండటంతో హైమావతి పెద్ద కుమార్తె, అల్లుడికి అదే రోడ్డులో ఉంటున్న బంధువులు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు టంగుటూరు చేరుకొని ఇంటి తాళం పగలకొట్టి చూడగా, ఇంటి లోపల నిర్జీవంగా పడి వున్న హైమావతిని చూసి నిర్ఘాంత పోయారు. చేతి మణికట్టు కత్తితో కోసి, మెడకు కండువాతో ఉచ్చు బిగించి ఉంది. అలాగే బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. సంఘటనా స్థలంలో రెండు కత్తులు పడి ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలియోతో..

బొడపాడి హైమావతి పోలియో వచ్చి కాలు చచ్చుబడిన దివ్యాంగురాలు. ప్రభుత్వం నుంచి పింఛను కూడా వస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తెకు వివాహం అయింది. రెండో కుమార్తె బిట్రగుంట కేజీబీవీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. రెండో కుమార్తె పుట్టిన రోజున తల్లి మరణ వార్త వినాల్సి వచ్చిందని కన్నీరు మున్నీరు అయింది.

నిందితుడిని త్వరలో పట్టుకుంటాం

అన్ని కోణాల్లో విచారణ చేసి నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, ఇంటి పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌టీం ఇంటి పరిసరాలల్లో వేలిముద్రలు సేకరించింది. డాగ్ స్క్వాడ్ హత్య జరిగిన ఇంట్లో, పరిసర ప్రాంతాల్లో గాలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రక్తపు మడుగులో ఉన్న మృతురాలు హైమావతి



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై, క్లూస్‌టీం



ఘటన స్థలంలో డాగ్ స్క్వాడ్

చీకట్లో గ్రానైట్ పరిశ్రమలు

- 100కు పైగా కంపెనీలకు కరెంట్ కట్
- కరెంటు బిల్లులు చెల్లించలేని స్థితిలో కంపెనీలు

చీమకుర్తి రూరల్: కరెంటు బిల్లులు చెల్లించ లేదని గ్రానైట్ కటింగ్ పరిశ్రమలకు కరెంటు నిలుపుదల చేశారు. మంగళవారం మండలంలోని కమ్మంపాడు మర్రిచెట్ల పాలెం, బూదవాడ ప్రాంతాల్లోని గ్రానైట్ కటింగ్ చేసే 100 ఫ్యాక్టరీ లకు పైగా కరెంటు బిల్లులు చెల్లించలేదని విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ కట్ చేశారు. మార్కెట్ డిమాండ్ లేక కొనేవాళ్లు రాక పోవడంతో అష్ట కష్టాల్లో గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో విద్యుత్ శాఖ అధికారులు ఫ్యాక్టరీలపై దాడులు చేయటం అమానుషని వారు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇష్టం వచ్చినట్లు నిబంధనలకు విరుద్ధంగా కరెంట్ కట్ చేయడం, మరో పక్క కరెంట్ బిల్లులు కట్టాలని సమాచారం ఇవ్వకుండా, కరెంట్ కట్ చేస్తున్నారు. కరెంట్ లేని కారణంగా రాత్రులు దొంగలు పడి ఫ్యాక్టరీల్లో సామగ్రి దొంగలిస్తున్నారు. ఇప్పటి కైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిచి గ్రానైట్ పరిశ్రమలను కాపాడాలని యజమానులు కోరుకుంటున్నారు.



అంధకారంలో ఉన్న గ్రానైట్ కటింగ్ పరిశ్రమ

అదనపు విధుల నుంచి మినహాయించాలి

ఒంగోలు అర్బన్: సచివాలయంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు అదనంగా కేటాయించిన విధుల్లో మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ చిరంజీవిని కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సీఈఓ పరిశీలించి మినహాయింపు ఇస్తామని భరోసా ఇచ్చారు. దీనిలో సంఘ సభ్యులు వరకుమార్, మసూద్ అలీ పాల్గొన్నారు.

పౌరులందరినీ ఏకం చేసేదే రాజ్యాంగం

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: దేశంలోని విభిన్న వర్గాల ప్రజలను, జాతులు, కులాలు, మతాలకతీతంగా ఒకతాటిపై నడిపిస్తున్న ఘనత రాజ్యాంగానిదేనని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. భారత దేశాన్ని అభివృద్ధి, శాంతి వైపు నడిపించేందుకు మహనీయుడు అంబేడ్కర్ అనేక దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మన దేశ రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠికను చదివి వినిపించి పోలీసులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సేవలను అందించాలని చెప్పారు. భారత రాజ్యాంగం విశిష్టత, గొప్పదనాన్ని తెలుసుకోవాలని, రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అనుభవిస్తూనే బాధ్యతలను కూడా నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. బంగారు భారత్ నిర్మించుకునేందుకు రాజ్యాంగ విలువలను పాటించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో పోలీసు పాత్ర కీలకమైందని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడడంలో పోలీసుల పాత్ర ఎంతో ఉందన్నారు. డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీపీఏ ఏఓ రామ్మోహనరావు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

గిరిజనుల అభ్యున్నతికి చర్యలు

ఒంగోలు వన్‌టౌన్: గిరిజనలు అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.జగన్నాథరావు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150 జయంతి వేడుకల ముగింపు కార్యక్రమాన్ని ఒంగోలులోని గిరిజన భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీడబ్ల్యూఓ మాట్లాడుతూ గిరిజన స్వాతంత్ర్య సమర యోధులను గుర్తు చేసుకునేందుకు వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒంగోలులో గిరిజన వసతి గృహం కోసం కలెక్టర్ అనుమతితో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. వై.పాలెంలో బాలికల వసతి గృహం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గిరిజనలు అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒంగోలు సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.అమర సుబ్బయ్య, వై.పాలెం అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.